# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 02-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ శాంతియుతమైన బహుళ ధ్రువ ప్రపంచాన్ని భారత్ కోరుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశంతో కలసిరావాలని క్వాడ్ సభ్య దేశాలను విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్ కోరారు.
- ❖ భారతదేశం రక్షణ రంగంలో ఎగుమతిదారుగా అవతరించిందని రక్షణ మంత్రి రాజ్ నాధ్ సింగ్ అన్నారు.
- ❖ దేశంలో మాదక ద్రవ్యాల ముఠాలను నిర్వీర్యం చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
- ❖ అమర్‌నాథ్ యాత్రను జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈరోజు ప్రారంభించారు.

=========================

శాంతియుతమైన బహుళ ధ్రువ ప్రపంచాన్ని భారత్ కోరుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బ్రెజిల్‌లో ఈ నెల 6, 7వ తేదీల్లో జరగనున్న బ్రిక్స్ కూటమి సదస్సుపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యానికి కట్టుబడి ఉంటామని చెప్పారు. బ్రిక్స్ సదస్సు సందర్భంగా వివిధ దేశాల ప్రభుత్వాధినేతలతో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తామని తెలిపారు. అలాగే బ్రెజిల్ అధ్యక్షులు లూయిజ్ లులాడా సిల్వతో జరిగే సమావేశంలో అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయన్నారు. ఇదిలా ఉండగా ఐదు దేశాల పర్యటన కోసం ఈ రోజు ఉదయం ఢిల్లీ నుండి ప్రధానమంత్రి బయలుదేరారు. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాలలో ఆయన పర్యటించనున్నారు. ఆయా దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, పెట్టుబడులకు ఆహ్వానం పలకడం, వాణిజ్యం పెంపు వంటి అంశాలపై ప్రధానమంత్రి దృష్టి సారించనున్నారు.

=========================

ఘనా- భారతదేశం మధ్య చారిత్రాత్మక బంధం దశాబ్దాలుగా ఉందని ఘనాలో భారత హైకమిషనర్ మనీష్ గుప్త్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఘనా పర్యటన నేపథ్యంలో ఆకాశవాణికి ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల గురించి వివరించారు. మూడు దశాబ్దాల తరువాత భారత ప్రధానమంత్రి ఘనా దేశంలో పర్యటన చేస్తున్నారని మనీష్ గుప్త్ పేర్కొంటూ..

(వాయిస్ 34 సెకన్లు)

=========================

దేశంలో మాదక ద్రవ్యాలను సరఫరా చేసే ముఠాలను నిర్వీర్యం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. యువత వాటి బారిన పడకుండా చూసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య ముఠా గుట్టుని ఛేదించినందుకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఏజెన్సీలను ఆయన ఈ రోజు అభినందించారు. ఈ దర్యాప్తు బహుళ-ఏజెన్సీ సమన్వయానికి ఒక అద్భుతమైన ఉదాహరణగా అమిత్ షా అభివర్ణించారు. నాలుగు ఖండాల్లోని 10 కంటే ఎక్కువ దేశాలలో పనిచేసే ఈ అంతర్జాతీయ ముఠాని కట్టడి చేసే విషయంలో ఇప్పటికే అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు కఠిన చర్యలు తీసుకున్నాయని గుర్తు చేశారు.

=========================

పహల్గామ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టాలని క్వాడ్ సభ్య దేశాలు పిలుపునిచ్చారు. వారికి అన్ని విధాలుగా సాహాయం చేసిన వారికి కూడా శిక్ష పడాలని స్పష్టం చేశారు. వాషింగ్టన్ డీసీలో ఈ రోజు జరిగిన క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ఉగ్రవాదంపై భారత్ రాజీలేని పోరాటం చేస్తుందని పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

=========================

అమర్‌నాథ్ యాత్ర దేశ ఐక్యత, సోదరభావం, మత సామరస్యానికి ప్రతీక అని జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. అమర్‌నాథ్ యాత్రను భగవతినగర్‌లోని యాత్రి నివాస్ బేస్ క్యాంప్ నుంచి ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అమర్ నాథ్ యాత్ర భక్తి ప్రపత్తులకు నిదర్శనం అని చెప్పారు. కాగా ఈ యాత్రలో వేలాది మంది భక్తులు ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ సంవత్సరం సుమారు 5 లక్షలకు పైగా యాత్రికులు పాల్గొంటారని అధికారులు భావిస్తున్నారు. మొత్తం 38 రోజుల పాటు జరిగే అమర్‌నాథ్ యాత్రలో భక్తులు పవిత్ర గుహ వద్ద శివలింగాన్ని దర్శించుకుంటారు. ఈ యాత్ర ఆగస్టు 9న తేదీన ముగియనుంది. ఉగ్రదాడుల హెచ్చరికల నేపథ్యంలో స్థానిక బలగాలతో పాటు కేంద్ర మిలిటరీ దళాలను మోహరించారు. యాత్ర సురక్షితంగా కొనసాగడానికి అవసరమైన అన్ని చర్యలను జమ్ముకశ్మీర్ ప్రభుత్వం పూర్తి చేసింది.

విరామం

=========================

భారతదేశం రక్షణ రంగంలో అతి పెద్ద దిగుమతిదారు నుండి ఎగుమతిదారునిగా అవతరించిందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. 100 దేశాలకు రక్షణ ఉత్పత్తులు ఎగుమతి చేయడం ద్వారా భారత్ దాదాపు 24 వేల కోట్ల రూపాయలను సాధించిందని తెలిపారు. బీహార్ రాజధాని పాట్నాలోని జ్ఞాన్ భవన్‌లో ఈ రోజు జరిగిన బిజెపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 11 సంవత్సరాలలో తీసుకున్న అనేక కీలక నిర్ణయాల ఫలితంగా ప్రజల జీవితాలలో గణనీయమైన మార్పు వచ్చిందని గుర్తు చేశారు. ఎన్డీఏ కూటమి పాలనలో బీహార్ అభివృద్ధి పథంలో సాగుతోందని రాజ్ నాథ్ సింగ్ పేర్కొంటూ..

(వాయిస్ 31 సెకన్లు)

=========================

కరోనా అనంతర మరణాలకు టీకాతో ఎటువంటి సంబంధం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కరోనా అనంతర మరణాల మీద ఐసీఎంఆర్, ఎయిమ్స్ వివిధ పరిశోధనలు నిర్వహించాయని పేర్కొంది. కరోనాకు ముందు నాటి ఆరోగ్య పరిస్థితుల ప్రభావమే ఆయా మరణాలకు గల కారణాలలో కీలక అంశమని తెలిపింది. కాగా కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటి సంస్థలు వాటి అధ్యయనాల నివేదికలను వెల్లడించినట్లుగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరించింది.

=========================

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈరోజు న్యూఢిల్లీ షాలిమార్ బాగ్‌లో చారిత్రాత్మకమైన పార్కు పునరుద్ధరణ పనులతో పాటు ఇతర వారసత్వ నిర్మాణాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించిన మంత్రి పార్కు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టిన భారత పురావస్తు సర్వేను, ఢిల్లీ అభివృద్ధి అధారిటీని ప్రశంసించారు. ఈ పార్కు త్వరలో జాతీయ రాజధానికి గుండెచప్పుడు అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, ముఖ్యమంత్రి రేఖ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

=========================

ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం (ELI) ద్వారా రాబోయే నాలుగు సంవత్సరాలలో ఉద్యోగులు యజమానులకు లక్ష కోట్ల రూపాయలను అందించనున్నామని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈ రోజు తెలిపారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... కొత్తగా ఉద్యోగం పొందిన ఏ యువకుడికైనా సంవత్సరానికి రెండుసార్లు 7,500 రూపాయలు ఈ పథకం ద్వారా ఇస్తామని చెప్పారు. దేశంలోని యువతకు ఉపాధి కల్పించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ELI పేరుతో ఐదేళ్ల పథకాన్ని రూపొందించారని మన్సుఖ్ మాండవీయ తెలిపారు.

=========================

ఇంగ్లాండ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండవ టెస్ట్ మ్యాచ్ ఈరోజు ప్రారంభమైంది. తొలుత బ్యాటింగ్ చేస్తున్న భారత జట్టు టీ విరామ సమయానికి 3 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. కాగా ఈ అండర్ సన్ టెండూల్కర్ ట్రోఫీలో ఇంగ్లాండ్ జట్టు ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉంది.

=========================

దేశ వ్యాప్తంగా రానున్న ఆరేడు రోజులు పాటు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు భారీ వర్ష సూచన ఉందని పేర్కొంది. అదే విధంగా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ఇదిలా ఉండగా, హిమాచల్‌ప్రదేశ్ లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఆ రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో భారత వాతావరణ శాఖ (IMD) రెడ్ అలర్ట్ జారీ చేసింది.